'ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలి'

మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి

సూర్యాపేట లీగల్, జనవరి 8: ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కారాగారాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఖైదీలు చెడు అలవాట్లకు బానిసలు కావొద్దని, ఐకమత్యంతో ఉండాలని సూచించారు. అనంతరం జైలు అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిఫెన్స్ కౌన్సిల్ వి.సత్యనారాయణ పిళ్లై, వెంకటరత్నం, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలపై అవగాహన

పెన్‌పహాడ్: నాగులపాటి అన్నారంలో ర్యాలీ నిర్వహిస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

పెన్‌పహాడ్, జనవరి 8: మండలంలోని నాగులపాటి అన్నారం గ్రామంలో తపాలా శాఖ ఉద్యోగులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం తపాలా శాఖ జీవిత బీమా పథకంపై ఖాతాదారులకు, గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిబాబు, మెయిల్ ఓవర్ సీర్ అప్పయ్య మాట్లాడుతూ.. ప్రజలు తపాలా శాఖ ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం జీవిత బీమా, చిన్న మొత్తాల పొదుపుపై తెలియజేశారు. బ్రాంచి పోస్ట్ మాస్టర్లు, పోస్టల్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు నెమ్మాని సాంబయ్య, కోటేశ్వర్‌రావు, భరత్, సత్యవతి, చందన, శివ, వంశీ, చేతన, వైష్ణవి, అభిలాశ్, రాజేశ్, లాల్‌వర్ధన్, ఉమ, ప్రేమ్‌కుమార్, సుమన్ పాల్గొన్నారు.

గరిడేపల్లి: తపాలా శాఖ జీవిత బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా తపాలా శాఖ జీవిత బీమా అభివృద్ధి అధికారి జింగిరాల సైదులు అన్నారు. తపాల శాఖ ఆధ్వర్యంలో వెలిదండ గ్రామంలో జీవిత బీమా పాలసీలపై నిర్వహించిన అవగాహన ర్యాలీ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోస్ట్‌మాస్టర్ అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'క్షయ రహిత సమాజానికి కృషి చేయాలి'

క్షయ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

నాగారం, జనవరి 8: మండల పరిధిలోని ఫణిగిరి గ్రామంలో బుధవారం క్షయ వ్యాధి నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హర్ష వర్ధన్ మాట్లాడుతూ.. ఎవరికైనా క్షయ వ్యాధి లక్షణాలు ఉంటే సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే పూర్తిగా నయమవుతుందని తెలిపారు. క్షయ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, 2025 వరకు దేశంలో పూర్తిగా నిర్మూలించాలని పిలుపునిచ్చారు. ఎవరికైనా క్షయ లక్షణాలు ఉంటే ఆశ కార్యకర్తలను, ఆరోగ్య సిబ్బందిని సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, సరస్వతి, యాదగిరి, ప్రవీణ్‌రెడ్డి, కల్యాణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం'

సూర్యాపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

సూర్యాపేట టౌన్, జనవరి 8: రైతుల సమస్యల పరిష్కారంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని గత 43 రోజులుగా ఢిల్లీలో నిరాహార దీక్ష చేస్తున్న జగత్‌సింగ్ దలివేల ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోందని, ఆయనకు ఎలాంటి హాని జరిగినా కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అన్నారు. ఏఐకేఎంఎస్ జాతీయ కమిటీ పిలుపులో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. గతంలో రైతులు ఉద్యమం చేపట్టిన సమయంలో ఇచ్చిన హామీలు నేటికీ నెరవేరలేదన్నారు. రైతులకు మద్దతు ధర చట్టాన్ని అమలు చేసే వరకు పోరాడతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు లక్ష్మయ్య, బొడ్డు శంకర్, జిల్లా నాయకుడు కనకారావు, కునుకుంట్ల సైదులు, పోలెబోయిన కిరణ్, బండి రవి, గండు నగేశ్, పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, పెద్దింటి అశోక్‌రెడ్డి, దండి ప్రవీణ్, చిన్నగాని పెద్ద సాంబయ్య, పర్వతాలు, చామకూరి వెంకటయ్య, మాశెట్టి అంజయ్య, కారింగుల బ్రహ్మయ్య, సూరయ్య పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చింతలపాలెం, జనవరి 8: అక్రమంగా తరలిస్తున్న, నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ అంతిరెడ్డి కథనం ప్రకారం.. చింతలపాలెం గ్రామానికి చెందిన లాలాసాహెబ్ అనే వ్యక్తి బుధవారం టీవీఎస్ ద్విచక్ర వాహనంపై రెండు క్వింటాల రేషన్ బియ్యాన్ని రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. అతడిని విచారించగా శోభనాద్రిగూడెం గ్రామంలోని ఓ కోళ్ల ఫారానికి బియ్యాన్ని తరలిస్తున్నట్లు తెలిపాడు. అక్కడికి వెళ్లి తనిఖీ చేసి సుమారు 10 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని కోళ్లఫారం యజమానులు మిరియాల రమేశ్, షేక్ జాన్‌సైదాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

'ఉద్యమకారుల పాదయాత్రను జయప్రదం చేయాలి'

తుంగతుర్తి, జనవరి 8: తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 19న మండల పరిధిలోని కొత్తగూడెంలో ఉన్న కామ్రేడ్ మారోజు వీరన్న స్థూపం నుంచి హైదరాబాద్‌కు చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం నాయకులు సర్గం మల్లయ్య, ఎలగందుల మల్లేశ్ నేత కోరారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉద్యమకారులకు పెన్షన్, 250 గజాల్లో ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మలిదశ ఉద్యమకారులు చెన్న రామ్మూర్తి, బెడిద రాములు, కంచర్ల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా యొక్క క్రయింటు అయిన కారింగుల నందిని, భర్త: దావీదు, నివాసం: బిక్కుమళ్ల గ్రా, నూతనకల్ మం, సూర్యాపేట జిల్లా గారి నుండి సంజాయిషీ పొంది సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.నా క్రయింటు ఈ క్రింది షెడ్యూల్ ఆస్తి విక్రయ రిజిస్ట్రార్ దస్తావేజు నెం. 8739/2024 ద్వారా కాసా మల్లేష్ యాదవ్ గారి నుండి క్రయం పొంది, ఆనాటి నుండి తమ సంపూర్ణ స్వాధీన యాజమాన్య హక్కు కలిగి యున్నారు. ఇట్టి ఒరిజినల్ దస్తావేజు నెంబరు 8739/2024 దస్తావేజుకు మూలధారమైన ఒరిజినల్ లింకు దస్తావేజు నెంబర్లు 4087/2024, 6171/2023, 7711/2013 పీటిలో నుండి 7711/2013 సూర్యాపేటలో జారుకు తీసుకునే సమయంలో పోయినవి. ఇట్టి ఒరిజినల్ డాక్యుమెంట్ కొరకు ఎంత వెతికినను లభించలేదు. ఇట్టి దస్తావేజును నా క్రయింటు అయిన కారింగుల నందిని, భర్త దావీదు గారు ఎద్దైనా బ్యాంకులకు గాని, ఆర్థిక సంస్థలకు గాని, వ్యక్తులకు గాని, లీజు గాని ఏ విధమైన తాకట్టు గాని, మదుపు పెట్టడం గాని చేసియుండలేదు. ఇట్టి ఆస్తి తనఖాయుంచి నా క్రయింటు ప్రభుత్వ లేదా ప్రయివేటు బ్యాంకులో లేదా ఇతర ఫైనాన్సు కంపెనీల నుంచి లోను తీసుకోదలచినారు. ఇట్టి దస్తావేజుల ద్వారా ఎవరికైనా ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షములో ఈ క్రింద తెలిపిన చిరునామాకి సంబంధిత ఆధారా పత్రాలతో వారి యొక్క హక్కులు ఈ ప్రకటన వెలువడిన తేది నుండి వారం (7) రోజులలో తెలుపుకోనగలరు. దరిమిలా వచ్చిన అక్షేపణలు నా యొక్క క్రయింట్కు ఏ విధముగా కూడా బాధ్యులను చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవలసిన చిరునామా. షెడ్యూలు ఆస్తి : నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్ గారి అజ్మాయిషీ లోన్లో యుండి సూర్యాపేట జ్యూడిషిక్షనోసు, జిల్లా పరిషత్, సూర్యాపేట, సూర్యాపేట మునిసిపల్ పరిధిలోని (పాత గ్రామపంచాయితీ గాంధీనగర్) పిల్లలమర్రి రెవిన్యూ గ్రామ శివారులో సర్వే నెం. 409/ఇ మరియు 410/ఇ లో ప్లాట్ నెం. 139 గల దాని విస్తీర్ణం 200 చ.గ.లు సరియగు 167.22 చ.మీ.లు గల భూమి స్థలము ఇండస్ట్రియల్ రెసిడెన్షియల్ ఏరియాలో ఉండి ఈ దిగువ హద్దులు కలిగియుండి. ఉత్తరం : ప్లాట్ నెం. 140, దక్షిణం : ప్లాట్ నెం. 140, తూర్పు : 25 అ. ల రోడ్డు, పడమర : ప్లాట్ నెం. 144.

సం/- నాగబండి కృష్ణమూర్తి, అడ్వకేట్, ఇ.నెం. 1-7-847/జి3-199/1/సి, పబ్లిక్ క్లబ్ ఎదురుగా, నయాగర్, కోదాడ- సూర్యాపేట జిల్లా. సెల్ నెం. 98482 56389.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఆత్మకూర్.ఎస్, జనవరి 8: మండల కేంద్రంలోని పూర్వ విద్యార్థుల భవనంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కంచి కామకోటి ట్రస్ట్ వారి హైదరాబాద్‌కు చెందిన శంకర కంటి ఆసుపత్రి సహకారంతో పూర్వ విద్యార్థుల సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు శిబిరాన్ని నిర్వహించనున్నారు. కంటి సమస్యలతో బాధపడే వారు ఆధార్ కార్డుతో పాటు గతంలో వాడిన మందుల చిట్టీలను వెంట తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు. అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

ప్రభుత్వ సిబ్బంది సమయపాలన పాటించాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట: డీఎంహెచ్ఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

సూర్యాపేట, జనవరి 8: సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలందించాలని, క్షేత్రస్థాయిలో పర్యటించే సిబ్బంది కచ్చితంగా కార్యాలయంలోని మూమెంట్ రిజిస్టర్‌లో పర్యటన వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా వైద్యాధికారి కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది హాజరు పట్టికలో సంతకాలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లారని చెప్పగా.. రిజిస్టర్ ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. మరోసారి పునరావృతం కావొద్దని అన్నారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి పరిపాలన అధికారి డాక్టర్ శ్రీశైలం, ప్రోగ్రాం అధికారి డాక్టర్ నాజియా, సిబ్బంది పాల్గొన్నారు.

జాతర ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

మేళ్లచెర్వు: స్థానిక స్వయంభూ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి నెలాఖరున జరగనున్న మహాశివరాత్రి జాతర విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. బుధవారం ఆలయ ఆవరణలో పలు శాఖల అధికారులతో జాతర ఏర్పాట్లపై ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు లేకుండా కల్పించాలని ఆదేశించారు. అంతకుముందు కందిబండ శివారులో ఇటీవలి వర్షాలకు కూలిన బ్రిడ్జిలను ఆయన పరిశీలించారు. డీపీఓ నారాయణరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ జ్యోతి, సీఐ రజితారెడ్డి, ఎంపీడీఓ ఖాజా అజ్గర్‌అలీ, ఎస్ఐ పరమేష్, ఆలయ ఈఓ కొండారెడ్డి, చైర్మన్ శంభిరెడ్డి, అర్చకులు శివవిష్ణువర్ధన్‌శర్మ , ధనుంజయశర్మ తదితరులు పాల్గొన్నారు.

భూమి పరిశీలన

మఠంపల్లి: మండల పరిధిలోని నాగార్జున సిమెంట్స్ పరిశ్రమ గుండ్లపల్లి రెవెన్యూలోని 170 సర్వే నంబర్‌లో ఉన్న 322 ఎకరాలను అదనపు లీజ్ కోసం కేంద్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా బుధవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ భూమిని పరిశీలించారు. మైనింగ్ ల్యాండ్‌కు సంబంధించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తాసీల్దార్ మంగా రాథోడ్, పరిశ్రమ ప్రతినిధులు సతీశ్, విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణాలకు శంకుస్థాపన

నాగారం: అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

తిరుమలగిరి, జనవరి 8: మండలంలోని మామిడాల గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి, వెలిశాలలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మందుల సామేల్ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితలు పాల్గొన్నారు.

నాగారం: మండలంలోని వర్ధమానుకోట గ్రామంలో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి ఎమ్మెల్యే మందుల సామేల్ శంకుస్థాపన చేశారు.

రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి : ఏపూరి సోమన్న

మునగాల, జనవరి 8: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని బహుజన యుద్ధనౌక, లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల కార్యక్రమ సాంస్కృతిక కళాకారుల రాష్ట్ర అధ్యక్షుడు ఏపూరి సోమన్న ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లక్ష డప్పులు-వెయ్యి గొంతుకల సాంస్కృతిక మహా ప్రదర్శన బుధవారం మండలంలోని బరాఖత్‌గూడెం చేరుకున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కొంతమంది స్వార్థపరుల కుట్రలతోనే వర్గీకరణ ఆలస్యం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు నాగరాజు, శ్రీను, కనకయ్య, రమేశ్, సైదులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కోదాడ టౌన్: కోదాడకు చేరిన మహా ప్రదర్శనకు మాదిగలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ కోదాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఏపూరి రాజు మాదిగలో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

'వ్యవసాయ కార్మికులకు షరతులు లేకుండా రూ.12 వేలు ఇవ్వాలి'

సూర్యాపేట టౌన్, జనవరి 8: భూమి లేని వ్యవసాయ కార్మికులకు షరతులు లేకుండా ఏడాదికి రూ.12 వేలు అందజేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎంపీఎన్ భవన్‌లో 'వ్యవసాయ కార్మికులు- పాలకుల వాగ్దానాలు- సంక్షేమ పథకాల అమలు' అనే అంశంపై బుధవారం ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. తక్షణమే విధివిధానాల రూపకల్పనకు అఖిలపక్షాలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బెల్లకొండ వెంకటేశ్వర్లు, వరికుప్పల వెంకన్న, పేర్ల నాగయ్య, బొడ్డు శంకర్, ఆవుల నాగరాజు, నారబోయిన వెంకట్, కొట గోపి, మద్దెల జ్యోతి, నజీర్, కరీం, దనియాకుల శ్రీకాంత్, వి.సాయికుమార్, మేకనబోయిన సైదమ్మ, పిండిగ నాగమణి, కిరణ్, జె.నరసింహారావు, హుస్సేన్, జానయ్య పాల్గొన్నారు.

'మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి'

నేరేడుచర్ల, జనవరి 8: తెలంగాణ మలిదశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సంఘం చైర్మన్ రాపోలు నవీన్‌కుమార్, బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు కోరారు. మలిదశ ఉద్యమకారుల పాదయాత్ర రెండో రోజు బుధవారం నేరేడుచర్ల నుంచి ప్రారంభమైన సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్నికల హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల స్థలంతో కూడిన ఇంటి నిర్మాణం చేసి ఇవ్వాలని, వయసుతో సంబంధం లేకుండా రూ. 25 వేల పింఛన్ అందించాలని, అందరికీ డిజిటల్ హెల్త్‌కార్డులు ఇచ్చి రూ.10లక్షల వరకు వైద్య సహాయం అందించాలని కోరారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ఫణిగిరి గుట్ట వద్ద నిర్మిస్తున్న 2,100 ఇండ్లలో అర్హులైన ఉద్యమకారులకు 200 ఇండ్లు కేటాయించాలని కోరారు. నాయకులు ఇంజమూరి రాజేశ్, పెరుమాళ్ల సతీశ్, తక్కెళ్ల నాగార్జున, చిలక బాబు, కొమర్రాజు వెంకట్, రణపంగ సైదులు, రణపంగ శ్రవణ్, ఎండీ.రఫీ, కొండ హరిబాబు, షేక్ మీరా, జానీ, అంజయ్య, రామయ్య పాల్గొన్నారు.

'వాహనదారులు నిబంధనలను పాటించాలి'

మునగాల, జనవరి 8: వాహనదారులు రోడ్డు నిబంధనలను పాటించాలని తాసీల్దార్ ఆంజనేయులు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, ఎంపీడీఓ రమేశ్ దీన్‌దయాల్ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గణపవరం రోడ్డు సెంటర్‌లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వాహనాలను అతివేగంగా, హెల్మెట్ ధరించకుండా, ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి, పరిమితికి మించిన లోడుతో, రాంగ్ రూట్‌లో నడపొద్దని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులకు సూచించారు. దేవరం వెంకట్‌రెడ్డి, గంధం సైదులు, నారాయణ, గిరి, ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పెయింటింగ్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడిగా ఉపేందర్

సూర్యాపేట టౌన్, జనవరి 8: జిల్లా పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం స్థానిక గాంధీపార్కులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా పాముల ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే.బాబా, కోశాధికారిగా మోర సైదులును ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా గుండాల కృష్ణ, ఏజాజ్, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా గుండాల చంద్రయ్య, ఎండీ.రఫీ, అర్జున్, ఉపాధ్యక్షులుగా సైదులు పిట్నీ, నబీదాస్, సహాయ కార్యదర్శులుగా అలీమ్, మేకల సతీశ్, వైస్ జాయింట్ ప్రెసిడెంట్‌గా సాంబారు వెంకన్నతో పాటు కార్యవర్గ సభ్యులుగా చారగొండ్ల శ్రీనివాస్, బొజ్జ నాగరాజు, వేణు, భూక్యా సాయి, సందీప్, శాంతికుమార్, నజీర్, సుబాని, వల్దాస్ అభినయ్, బి.నాగయ్యను ఎన్నుకున్నారు.

'సొసైటీ బలోపేతానికి పాలకవర్గం కృషి చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ సైదులు

తుంగతుర్తి, జనవరి 8: సొసైటీ బలోపేతానికి పాలకవర్గం కృషి చేయాలని సింగిల్ విండో చైర్మన్, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో రూ.8 కోట్లు ఉన్న సొసైటీ టర్నోవర్‌ను ఐదేళ్ల కాలంలో రూ.25 కోట్లకు చేర్చినట్లు పేర్కొన్నారు. సొసైటీ సీఈఓ వెంకటేశ్వర్లు, వైస్ చైర్‌పర్సన్ శ్రీలత, డైరెక్టర్లు రవీందర్‌రెడ్డి, రామచంద్రు, భిక్షం రెడ్డి, ఎండీ.మజీద్, యాకయ్య, ఈదప్ప, ఎడ్ల మల్లయ్య, రామనర్సమ్మ, పూలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

మఠంపల్లి, జనవరి 8: విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని కొత్తతండాలో బుధవారం చోటుచేసుకుంది. కొత్తతండాకు చెందిన బాణోతు తావు (43) పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఆఫ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. తావు భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.బాబు తెలిపారు. కాగా, మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మద్దిరాల, జనవరి 8: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్ఐ వీరన్న తెలిపారు. మండలంలోని పీర్యతండా శివారులో గల పాలేరు వాగు నుంచి మరిపెడ మండలం వెంకంపాడు గ్రామానికి చెందిన బడావత్ గణేశ్ ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా పీర్యతండా వద్ద పట్టుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

'పుట్‌పాత్‌లపై దుకాణాలను తొలగించాలి'

హుజూర్‌నగర్, జనవరి 8: హుజూర్‌నగర్ పురపాలక సంఘం పరిధిలో పుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన డబ్బా దుకాణాలను స్వచ్ఛందంగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుకాణాలు పుట్‌పాత్‌లపై ఏర్పాటు చేయడం వల్ల మురుగు నీటి వ్యవస్థకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు.

వాసవీ క్లబ్ జోన్ చైర్మన్‌గా లక్ష్మీనరసింహారావు

నేరేడుచర్ల, జనవరి 8: వాసవీ క్లబ్ జోన్ చైర్మన్‌గా నేరేడుచర్ల పట్టణానికి చెందిన గెల్లి లక్ష్మీనరసింహారావు నియమితులైనట్లు ఆర్య వైశ్య సంఘం నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మీనరసింహారావు నియామకం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.

వైద్య కళాశాలకు మృతదేహం అప్పగింత

సూర్యాపేట టౌన్, జనవరి 8: జిల్లా కేంద్రానికి చెందిన సోమ సరోజిని (86) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందారు. సరోజిని మృతదేహాన్ని కుటుంబ సభ్యులు వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మహావీర్ వైద్య కళాశాలకు విద్యార్థుల పరిశోధన నిమిత్తం అందజేశారు. ఈ కార్యక్రమంలో సరోజిని కుటుంబ సభ్యులు రవి, నాగలక్ష్మి, స్పందన శరీర అవయవదాన సంస్థ అధ్యక్షుడు గుండా రమేశ్, గౌరవాధ్యక్షుడు టి.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ విగ్రహాన్ని పునః ప్రతిష్ఠించాలి'

నేరేడుచర్ల, జనవరి 8: నేరేడుచర్ల ప్రధాన కూడలి వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించారని, తిరిగి అదే స్థలంలో విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని మా తరం యూత్ అధ్యక్షుడు జింకల భాస్కర్ కోరారు. ఈ మేరకు బుధవారం నేరేడుచర్లలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోడ్డు విస్తరణ పనులు పూర్తయి నెలలు గడుస్తున్నా పక్కన పెట్టి ఉంచిన అంబేద్కర్ విగ్రహాన్ని మాత్రం తిరిగి ప్రతిష్ఠించడం లేదని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

నేడు ముగ్గుల పోటీలు

కోదాడ టౌన్, జనవరి 8: సంక్రాంతి సందర్భంగా కోదాడలోని శ్రీమన్నారాయణ కాలనీలో దేవరపు పరమేశ్వరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు జయవరపు నరేందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలు మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమవుతాయని, సాయంత్రం నాలుగు గంటలకు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి చేతులమీదుగా బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు.

అంగన్‌వాడీ ఉద్యోగులు లక్ష్యంగా మోసాలు

- నిందితుడి అరెస్ట్

వివరాలు వెల్లడిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడ టౌన్, జనవరి 8: అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లను టార్గెట్ చేసి డబ్బులు వసూలు చేయడంతో పాటు పలువురికి అసభ్యకర మెసేజ్‌లు చేసిన నిందితుడిని కోదాడ పోలీసులు అరెస్ట్ చేశారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం కోనాయిపల్లి గ్రామానికి చెందిన పంది యాదగిరి (24) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆరు నెలల క్రితం ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్ల ఫోన్ నంబర్లను తెలుసుకొని వారికి కాల్స్ చేయడం మొదలు పెట్టాడు. ఉద్యోగ పరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప